మధ్యవర్తి

"అసలు నువ్వు నా కొడుకువే కాదు. పో ముందు బయటికి!"

"అదేమో నీకు తెలియాలి, మా అమ్మకు తెలియాలి! నేను మాత్రం వెయ్యి రూపాయలక్కడ పెడితేగాని ఎక్కడికీ కదిలేది లేదు."

"వెయ్యిరూపాయలు! ఈ రోజుల్లో! పాపం నువ్వు ఎప్పుడు అడుగుతావా అని కుప్పపోసుకూర్చున్నా! ఏం చేస్తావు వెయ్యిరూపాయలతో? మూటా మూటా మెడకు ఉరిపోసుకుంటావా?"

"మీ కటువంటి అనుమానం ఉంటే నోట్లుగానే ఇవ్వండి!"

"నోట్లో నల్లబొగ్గులో— వాటితో ఏం చేస్తావన్నాను?"

"ఏదో చేస్తానన్నాను! నీ కదంతా ఎందుకు? హోటలు పెట్టుకు బతుకుతాను."

"అదే! అటువంటి దేదో చేస్తే కాని నువు నా ప్రతిష్ఠ బాగా నిలబెట్టిన వాడివి కావు. ఏం?"

"నే నెవరో? మీ రెవరో? మీ ప్రతిష్ఠ నేను నిలబెట్టేదేమిటి, కనీసం మీ కొడుకునన్నా కానప్పుడు!"

"ఆ కూత నువ్వు కూస్తున్నావుకాని, ఇంకా లోకమంతా కుయ్యటం లేదుగా, కోడై!"

"మొదట నువ్వే కూశావో నేనే కూశానో మనిద్దరికి తెలుసు... అయినా, నాకు పోట్లాడటం సరదా అనుకోకండి. అటువంటప్పుడు అసలు విషయం దగ్గిర తగాదాపడటం ఎట్లాగూ తప్పేటట్టు లేదు. వ్యర్థకలహంలోకి కూడా ఎందుకు దించుతారు?"

"మాటలు నేర్చావు. చాతకాని వెధవా! పోయి సంపాదించు. నిన్ను బియ్యే చదివించి నీకోసం ఎంత తగలెయ్యాలో అంతా తగలేశాను. ఇక నా దగ్గిర చిల్లి గవ్వ లేదు"

"ఆ సంపాదనకే పెట్టుబడి కావాలిసి వెయ్యిరూపాయలు అడిగాను. అవి పెట్టుకొని యావజ్జీవమూ తిందామని కాదు."

"నీ జన్మకు పెట్టుబడి అదివరకే అయిపోయింది. ఇక దమ్మిడీలేదు.... ఉద్యోగంచేసి యేడుస్తావని ఆ పెద్దమనిషి కాళ్లా వేళ్లాబడి శిఫారసు చెయ్యటానికి వప్పిస్తే, ఆయన్ను కాస్తా అవమానపరచి, నాకు ఆయన మొహం చూడటానిక్కూడా తలవంపులుగా చేస్తావా?"

"అవమాన మేమిటి? నా కిప్పటికీ అర్థంకాకుండా ఉంది. తన తమ్ముడి కొడుక్కు పదిరూపాయల ఉద్యోగం ఇప్పించలేనివాడు నా ఉద్యోగానికి ఎట్లా శిఫార్సు చెయ్యగలడో! కళ్ళూ, చెవులూ లేనివాళ్ళకు చెప్పండి ఇటువంటి కబుర్లు."

"వాళ్ళే నయం!—నీ మాదిరిగా దురహంకారంతో గింజుకోక, రోజుకో పావలా డబ్బులు యాచించుకోగల్గుతున్నారు."

"అవును. ఆ పని మీ ప్రతిష్టకు భంగకారి కాదుకూడనూ!... మొత్తానికి మంచి ఉపాయం కనిపెట్టావు- నన్ను అసలు విషయాన్నించి తప్పించి నాచేత అవీ ఇవీ వాగించటం!...నాకీ కబుర్లతో ఏమీ పనిలేదు. నేనింకో విషయం ప్రసంగించను. నాకు కనీసం వెయ్యిరూపాయలు కావాలి. ఎప్పుడిస్తావో చెప్పు. అంతదాకా పెద్దమనిషి తరహాగా ఊరుకుంటాను. ఆ పైన ఒక్క క్షణం కూడా కొంపలో ఎవరికీ నిద్రాహారాలు లేకుండా చేస్తాను. చేసి తీరుతాను!"

"నీ తాతముల్లె దాచావా ఏమిటి నా దగ్గిర?"

"నా తాతముల్లె కాకపోతే నీ స్వార్జితం నాకిమ్మన్నానా ఏమిటి? నీ డబ్బు నాకు విషతుల్యం. నా తాతముల్లె ఎనిమిదెక రాలుండాలి. ఏం చేశావదంతాను? దాన్లో నా కెంతవస్తుందో అంతా పంచండి. మీరు హరీ అన్న తరవాత మిగతాదాని సంగతి చూస్తాం!"

"మాటలు తిన్నగా రానీ, పుండాకోర్! నీ అక్కల పెళ్ళికి మూడేసి మూడేసి వేలు పోశాను. నీ దినవారాలకు మూడువేలు పైగా తగలేశాను. నీ తాతముల్లె అప్పుడే పోయింది. నడు ముందు బయటకి!"

"నా తాతముల్లెకు నాకన్నా ముందు నా అక్కల మొగుళ్ళు వారసులల్లే ఉన్నారు. తలా వెయ్యిన్నూట పదహారూ, వెండిసామానూ, అవన్నీ కట్టబెట్టి అల్లుళ్ళచేత నానా బూతులూ పడటాని కభ్యంతరం లేదు కాని కొడుక్కు 'బతుకుతానో, భగవంతుడా!' అంటే ఇవ్వటానికి చిల్లిగవ్వలేదు!"

"నిన్ను నేను బతకవద్దన్నానా? భరణం ఇస్తాను, ముండ కిచ్చినట్లు, తింటూ ఉండు!"

"నాకాభరణం అక్కర్లేదనే చెప్పటం. నేను కానీ కావాలన్నా మిమ్మల్ని అడగాలి. ఎందుకని మీచేత అడిగించుకోవాలి. రేపు యీ ముండభరణమే నా భార్యా కూడా పంచుకోవాలి— దాని కేదైనా కావాలంటే అది నన్ను ప్రార్థించటమూ, నేను మీతో మనవి చేసుకోవటమూ! తమ శలవైతే కద్దు, లేకుంటేలేదు... నాకిదంతా పనికి రాదు. నాకు వెయ్యిరూపాయలు కావాలి. ఎందుకు కావాలో కూడా చెప్పను. ఇవ్వకపోతే కొంపకు చిచ్చుపెట్టి తీరుతాను. అట్లా చెయ్యకపోతే నేను మీ కొడుకును కాదు."

"నువ్వసలు నా కొడుకువే కాదు. పో అవతలికి!...నువ్వూ, నీ పెళ్ళామూ!"

"దానిజోలి ఎత్తకండి, నాకు తూలుతుంది. నేను తూలితే మనిషిని కాను!"

వారంరోజులనించి, ఈ విధంగా నడుస్తున్నది దశరథరామయ్యకూ, కొడుకు హనుమంతరావుకూ.

ఏరకం మనుషులు ఆ రకం మనుషులతో అతికిపోతారని తెలీనివాళ్ళు అనుకుంటారు. కాని అది పూర్తిగా నిజంకాదు. ఇద్దరు మంచివాళ్ళ విషయంలో తప్ప అది వర్తించదు. ఇద్దరు చెడ్డవాళ్ళకు వాళ్ళ దుర్గుణాల సామ్యం వల్ల పొసగటం అసంభవం. ఇద్దరు పిసినిగొట్టులకు ఎట్లా పొసగుతుంది? గుణాల యొక్క మంచి చెడ్డలు నిర్ణయించటానికి ఇది ఒక మంచి ఉపాయం కూడానూ. ఒక గుణాన్ని ఆ గుణంతోనే పరీక్షచెయ్యాలి. ఏ గుణం కలవాడు ఆ గుణమే ఇతరుల్లో చూసి సహించలేడో, అది దుర్గుణం. మానవులను ఎడం చేసేవి దుర్గుణాలు. మానవులను దగ్గిరికి చేర్చి జాతికి ఐక్యమత్యమూ, బలమూ చేకూర్చేవి సద్గుణాలు.

ఈ తండ్రీ కొడుకులు అనేక విషయాల్లో ఒకరినొకరు పోలినవారే. కాని ఇద్దరికీ పడలేదు. హనుమంతరావుకున్న ఓర్పులేనితనం చూస్తే దశరథరామయ్యకు ఒళ్ళు మంట. దశరథరామయ్యకు ఓర్పులేకపోవడం చూస్తే హనుమంతరావుకు ఒళ్ళు మండేది. కాస్త కోపం రాగానే అవతలివాణ్ణి గడ్డిపరక కింద కట్టివేయటం తండ్రిలో పెద్ద దుర్గుణమని హనుమంతరావు నమ్మకం. కాస్త వాదనలోకి దిగగానే తన్ను "నువ్వు నువ్వు" అని సంబోధించటమేకాక, తన్నొక వెంట్రుక కింద కట్టి మాట్లాడటం తన కొడుకుకున్న పెద్ద తెగులని దశరథరామయ్య నమ్మకం. వీరిద్దరి తగాదా పరిష్కారం అయ్యేదెట్లా ?

తను మాట్లాడినదాన్లో పాయింటు ఉన్నదని దశరథరామయ్య కొడుక్కు తెలియ చెయ్యాలని ప్రయత్నం చేస్తూ, అతను అది చూడకపోవటం చూచి మరింత మండిపడేవాడు. సరిగా అదే సమయంలో హనుమంతరావుకూడా తన పాయింటు తండ్రికి విప్పి చూపిస్తూ, ఆయన దాన్ని గమనించకపోతే మరింత మండిపడేవాడు.

"ఏంరా, అబ్బాయి ! శేషగిరిరావు గారితో మాట్లాడాను. నీకు ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. కాస్త ఆయనకు కనపడుతూ ఉండు అప్పుడప్పుడూ !"

"ఆయన ఎట్లా ఇప్పిస్తాడు నాన్నగారూ? ఆయనకంత పలుకుబడే ఉంటే, నరసింహారావు నిరుద్యోగిగా ఉండటమేమీ ?"

ఈ పోట్లాట ఈ విధంగా ప్రారంభమయిందంటే ఎవరైనా నమ్మగలరా ?

కాని ఇది యిట్లా ప్రారంభం కావటం సౌభాగ్యమ్మగారు కళ్ళారా చూస్తూ చెవులారా విన్నది. ఆరోజు కారోజు ఈ వివాదం పెరిగిపోతున్న వైనంచూసి ఆవిడ తన కళ్ళనూ, చెవులనూ తనే నమ్మలేక పోయింది. చదరంగం మొదలైన ఆటల్లో ఆడేవాళ్ళ కన్న చూసేవాళ్ళకు ఆటయొక్క కిటుకులు బాగా తెలిసినట్టు, ఆవిడకు ఈ కలహం ఎంత వృథా కలహమో తండ్రి కొడుకులకన్న బాగా తెలుసును. ఆ యిద్దరూ చిన్న అగ్ని కళకాని ఒక మండదగిన కట్టెగాని లేకుండా, గాలిడీ చేసి కాలే జ్వాల తయారుచేశారు. అది చల్లారాలంటే ఎక్కువ శ్రమకూడా అవసరం

లేదు. తండ్రికొడుకు లిద్దరూ, తమవల్ల పొరపాటుందని చెంపలు వాయించుకోను కూడా అక్కర్లేదు. రెండోవారు చెప్పే మాటల్లో కించిత్తు సబబు ఉందేమో చూతామని అనుకుంటే చాలును— ఈ తగాదా కట్టుబడిపోతుంది. ఎవరికన్న ఎవరు రెండో వారిని ఎంత ఎక్కువ నీచంగా చూడగలుగుతారో చూతామని ఇద్దరూ ఎంతకూ పట్టుపట్టుకు కూర్చుంటే పాపం ఆడది సౌభాగ్యమ్మ ఏం చెయ్యగలదు ? ఇద్దరిచేతా ఇంతవయసు గడిచిన తరవాత ఇప్పుడు రంకులు కట్టించుకుంటూ, ఇద్దరి సందునా నలగటం తప్ప ! ఆవిడ ఎడంగా ఉంటేనే ఇంత సౌరభ్యంగా ఉంది; ఇక ఆవిడ మధ్యవర్తితనం చెయ్యబోతే వాళ్ళు ఆమెను బతకనిస్తారా ? ఉత్తది, ఆవిడ ఒక్క నమస్కారం చేసి, "దీనికి అంతు ఎప్పుడురా భగవంతుడా ?" అని ప్రార్థించింది.

ఆ యిద్దరిలోనూ పైకి చూడటానికి హనుమంతరావు మెరుగనిపిస్తాడు. సాధ్యమైనంత వరకు అతను అవీ ఇవీ తవ్వడు. పోట్లాడటం ఇష్టంలేనివాడల్లే కనిపిస్తాడు. తండ్రి తూలినంత తూలినట్టుండడు, అప్పుడప్పుడూ వాదనలో తండ్రి మాటలు ఆయన మీదికే తిపి కొట్టి వినేవాళ్ళకు తప్పంతా తండ్రిదే నని పిస్తాడు. కాని అతని వల్ల కావలసినంత తప్పు లేకపోలేదు. పదిరోజుల కిందటి వరకూ తనకు కానీ కావలసినా సంతోషంతో తండ్రి నడిగి తీసుకోలేదా ? అది తనకు భరణంగా భావించాడా ? తను బియ్యే వరకూ చదవటానికి అయిన ఖర్చంతా వృథా అయిందనీ, తనకు ఏ చిన్న ఉద్యోగమన్నా దొరక్క పోవటం తన ప్రారబ్ధమనీ, అతను అనేకమార్లు అనుకోలేదా ? తన అక్కలకు తన తాత ఆస్తిమీద నైతికంగా తనకున్న అధికారం ఉందని ఎన్నోసార్లు ఎంతోమంది దగ్గిర అనలేదా ? ఇవన్నీ అడిగేవారెవరు ?

కాస్త కోర్టుపని తగిలి దశరథరామయ్యగారు బస్తీకి వెళ్ళవలసివచ్చింది. హనుమంతరావు అత్తవారి ఊరు ఆ ఊరే. సహజంగా దశరథరామయ్య వియ్యంకుడి ఇంటికే వెళ్ళాడు ఆతిథ్యానికి.

దమయంతి మామగార్ని చాలా మర్యాదచేసి, కుశల ప్రశ్నలడిగి, కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చి ఎంతో గౌరవించింది. దశరథరామయ్యకు కోడల్ని చూడగానే ఎందుకో ప్రాణం లేచివచ్చినట్టయింది. ఈ వారం రోజులనుంచీ తీక్ష్ణమైన ఎండ దెబ్బతగిలి నెర్రెలు పడ్డట్టున్న ఆయన హృదయం మీద అమృత వర్షం కురిసినట్టయింది.

కామక్రోధాదులను తిరస్కరించే మహర్షులు సహితం సద్గుణాలకు లొంగిపోయేవాళ్ళు. వారం పదిరోజులనించీ గౌరవించబడటం కాని, సానుభూతి చూపబడటం కాని అనుభవించని దశరథరామయ్యకు కోడలి ఆపేక్ష ఎంత అహ్లాదకరంగా ఉందో ? తన గర్భవాసాన పుట్టి తన్ను వేధిస్తున్న హనుమంతరావుతో ఈ పిల్లను పోల్చుకున్నాడేమో దశరథరామయ్య ? ఎవరి సానుభూతితోనూ తమకు ప్రమేయం

లేనట్టు నటిస్తూ అందరికన్నా ఎక్కువ సానుభూతి కావలసినవాళ్ళలో ఆయనకూడా ఒకడు.

ఏమయినా ఆయనకు దమయంతిని చూడగానే కలిగిన ఆనందానికి మేరలేదు. "ఈ పువ్వు ఎంత అందంగా ఉందీ ! ఎన్నడూ చూడలేదే ! ఆహా ! ఇది మనింట్లో ఉంటే ఎంత బాగుండును !" అని అపూర్వమైన పుష్పాన్ని చూసి మనం అనుకున్నట్టే అనుకోగలిగాడు దశరథరామయ్య దమయంతిని చూస్తూ. ఈ పిల్ల తన కోడలయినందుకు చాలా సంతోషమయింది. కాని, "ఆ వెధవ దీనికి తగడుకదా" అనే చింత ఆయన్ని కొంచెం బాధించింది.

వెయ్యవలసిన కుశల ప్రశ్నలన్నీ వేసి దమయంతి పారిపోలేదు. అక్కడే గడపలో ఆయనకు సగం కనబడుతూ నిలుచుంది. ఈ పిల్లతో తన కష్టసుఖాలన్నీ చెప్పుకోవాలని దశరథరామయ్యకు ఒక ఆవేశం వచ్చింది. ఆమెకూ తనకూ మధ్య ముప్పైఏళ్ళ తేడా ఉన్నమాట కూడా మరచిపోయి, ఆమె తన వయస్సు మనిషి అయినట్టూ, తను ఆమె వయస్సువాడల్లేను ఆయన మాట్లాడడం మొదలుపెట్టాడు. చిన్నతనంలో ఎప్పుడో ఆయన తన తల్లితో ఈ విధంగా మాట్లాడి ఉంటాడు. మళ్ళీ ఇప్పుడు ! ఈ అనుభవం ఆయన ఆత్మకు చాలా సుఖకరంగా కూడా ఉంది.

పూసగుచ్చినట్టు తనకూ, తన కొడుక్కూ నడిచిన తగాదా యావత్తూ దశరథరామయ్య కోడలికి చెప్పాడు, పొరపాటున అయినా తను కొడుకును అన్నమాటల్లో ఒకటయినా పయికిరానివ్వకుండా. దమయంతి తీరికగా ఆయన చెప్పేదంతా విన్నది. మధ్య మధ్య మాటలు కూడా అందుకున్నది. "నేను పసిదాన్ని ఇదంతా నా కెందుకు లేండి!" అన్నట్టుగా కాని "పెద్దనాంబసానితనం" కనపరుస్తూ కాని ఒక్క మాట కూడా రానివ్వలేదు, మాట్లాడటంలో ఆ తూకం సహజంగా రావాలి. దమయంతికది పుట్టకలోనే వచ్చింది.

దశరథరామయ్యగారు తనమీదినించి గొప్పభారం ఒకటి తొలగించుకున్నవాడల్లే తృప్తిపడ్డాడు. ఎట్లాగో అది తన నోటిమీదిగానే రావాలి. కనక, దశరథరామయ్య వియ్యంకుణ్ణి తన కొడుకు అవుపోసన కార్యం గురించి కదిలించాడు. దమయంతి కేం? పదిహేనేళ్ళు నిండుతై. రజస్వల అయి ఏడెనిమిది మాసాలు కూడా కావస్తుంది. ఆమె తండ్రి కొన్ని లాంఛనపు మాటలన్నా చివరకు సరేనన్నాడు. ముహూర్తం కూడా నిర్ణయం అయిపోయింది. ఈ మాట ఇంట్లో తెలియగానే తండ్రి కొడుకులకు మళ్ళీ ఘర్షణ జరిగింది.

"చేసేది నా కార్యమా? ఊళ్ళోవాళ్ళ కార్యమా? నాకు తప్పెట్లూ, తాళాలూ, బాజాలూ, వందమంది సాక్షులూ ఎందుకు? నా యిష్టం వచ్చినప్పుడు వెళ్ళి నా పెళ్ళాన్ని నేను తెచ్చుకుంటాను" అని హనుమంతరావూ, "నీ యిష్టం వచ్చినట్టే ఏడుచుకో, నువ్వెట్లా ఛస్తే నాకెందుకు?" అని దశరథరామయ్యా, ఆ పోట్లాట అప్పటికి ఆఖరు చేశారు.

"అమ్మయ్యో! మీకు పోట్లాడటం ఎంత సరదా అండీ! నాతో ఎప్పుడూ పోట్లాడరు కదూ? ఎవరికైనా కోపం వస్తే నా ప్రాణాలు పీచుపీచుమంటాయి!" అన్నది దమయంతి.

హనుమంతరావు నవ్వాడు. అతను భార్యను తెచ్చుకొని వారం రోజులయింది. ఇక ముందెట్లా వున్నా, యిప్పటివరకూ అతను పెళ్ళాంవంక నవ్వుతూ తప్ప చూడ లేకుండా ఉన్నాడు. ఇకముందు కూడా ఆమెమీద గాని, చివరకు ఆమె ఎదురుగా గాని కోపంతో ఉండటం కష్టంగానే ఉండేటట్టు ఉంది. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండే విద్య ఆమెకు తెలుసునల్లే ఉంది. ఆమె యొక్క సరదా అదొక రకమైన ఉత్తమ జాతి అంటువ్యాధి మాదిరిగా కూడా కనపడుతున్నది.

కొద్దికాలం కిందట తండ్రి చేసినపనే హనుమంతరా విప్పుడు చేశాడు— తను తన తండ్రిని అన్న మాటలన్నీ దాచిపెట్టి పెళ్ళాంతో తండ్రిమీద చాడీలు చెప్పాడు. భగవంతుడు దమయంతిని మధ్యవర్తితనం చెయ్యటానికి సృష్టించా డేమో. లేకపోతే వాళ్ళూవాళ్ళూ వచ్చి తమతమ రిపోర్టులు ఆమె దగ్గర చెయ్యటం ఎందుకు?

మధ్యవర్తులెప్పుడూ గోడమీద పిల్లివాటంగా ఉండాలి, లేకపోతే తమ ఉద్యోగం త్వరలో ఊడిపోగలదు. అందుకనేనేమో దమయంతి మొగుడులేన ప్పుడు మామగారితోనూ, ఒంటరిగా మొగుడితోనూ ఒక రకంగా మాట్లాడటం మొదలు పెట్టింది. ఆ రకం ఇదీ:

"ఎబ్బే! మీరు అనవసరంగా మథనపడుతున్నారండీ! మీరు అనేది ముమ్మాటికీ నిజమనుకోండీ! కాని ఆయన అనేమాట అబద్ధం కాదు. మీకు సరియైన మధ్యవర్తి ఉండి పనిచేస్తే మీ తగాదా సులభంగా తేలిపోతుంది!"

"నీకు తెలీదే, పిచ్చిదానా. అయినా నీకేమన్నా వాణ్ణి తిప్పగలనని ధైర్యం ఉంటే ప్రయత్నించు" అని దశరథరామయ్య అన్నాడు.

"సరే! ఇంకేం? మాకు నువ్వే మధ్యవర్తిగా ఉండు. ఇటువంటి బంగారపు చిలుక మాకు మధ్యవర్తిగా ఉండటం కన్న కావాలిసిందేమిటి?" అని హనుమంతరావు అన్నాడు.

కాని ఎన్నాళ్ళకూ దమయంతి వ్యవహారంలోకి దిగలేదు. ఎవరి దౌర్బల్యం ఏమిటో తెలిస్తేనేగాని మధ్యవర్తితనం సరిగా సాగదు. సహజంగా మొగుడి తత్వం తెలుసుకోటానికే ఆ కు ఎక్కువ అవకాశాలు లభించినై. ఆమెకు ఒకనాడు మంచి ఉపాయం తట్టింది. అవకాశం కోసం కనిపెట్టుకుని కూర్చుంది. పోట్లాట కొద్దిగానో, గొప్పగానో ప్రతిరోజు జరిగిపోతున్నది. కాని ఆమెకు కావలసిన అవకాశం అయి దారు రోజుల దాకా రాలేదు.

ఆనాడు మధ్యాహ్నం భోజనాలైన తరవాత దశరథరామయ్య భార్యతో ఏదో యింటి ఖర్చును గురించి మాట్లాడుతూ, కొడుకును కూడా ఒక పోటు పొడవటానికి

అవకాశం దొరికేటప్పటికి అది వదులుకోటం యిష్టంలేక— ఆయన యిటువంటి విషయాల్లో, పాపం! చిన్న పిల్లవాడి వంటివాడు:— "మీకేమే? 'అది చెయ్యి, ఇది చెయ్యి! నాకు పాతిక ఇయ్యి, యాభై ఇయ్యి!' అంటారు. చేసేవాడికి తెలుస్తుంది ఆ కష్టనిష్ఠూరాలు!" అన్నాడు.

ఇందులో హనుమంతరావు తండ్రి తన్ను ఎత్తిపొడిచా దనుకునేటందు కేమీలేదు. కాని ఇతను ఆ తండ్రి కొడుకే కనక తండ్రి ఉద్దేశం గ్రహించ గలిగిన వాడై, "అబ్బో! ఏమిచేత! బహు గొప్పచేత చేస్తున్నారు?" అని, పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నాడు. అప్పుడు దమయంతి కలిపించుకుంది.

"ఏమిటండీ, కాకపోయినా! ప్రతిదానికీ ఆయనమీదికి ఒంటికాలిమీద లేస్తారు! అంత చాతయినవారు మీరు చెయ్యరాదూ?.... ఆ తాళం చెవులు ఆయన కివ్వండి మామగారూ! నిజంగానే! ఏంచేస్తారో చూతాం! ఈ నూటి పోటీలన్నీ మీకెందుకు!"

దశరథరామయ్య ఒక్క క్షణం నిర్ఘాంతపోయినాడు. కాని దమయంతి మొహం చూసి ధైర్యం తెచ్చుకుని, "ఓ! మహారాజుగా" అంటూ తాళపుచెవులు తీసి కోడలి చేతిలో పెట్టాడు. దమయంతి అవి తీసుకొని మొగుడి మొహం ఎదట గలగల్లా డిస్తూ "ఇంద!" అన్నది.

హనుమంతరావు లోపల పొందిన ఆనందానికి మేరలేదు. తన తండ్రిని దమ యంతి ముచ్చటగా బుట్టలో వేసిందనుకున్నాడు కాని, పాపం ఏమీ లాభంలేదు. అత నికి ఎటువంటి బాధ్యతా వహించటానికి ఓపికలేదు. అటువంటి విషయాల్లో అతను అమిత సోమరి. తనకిప్పుడీ మేనేజిమెంటుకూడా ఎందుకు? కాని, దమయంతా? బాకువంటి పిల్ల!

అతను పెళ్ళాం వంక నవ్వుతూ చూసి, "అంటే సరి!" అని ఊరుకున్నాడు.

"తీసుకోండి మరి!"

"నేనిప్పుడు ఈ పెత్తనం తక్కువయిందనే దిగులుపడుతున్నా కాదూ?" అన్నాడు హనుమంతరావు.

"మాటలు మాత్రం అంటారు...పడేవాళ్ళుంటే! ఏం?" అంటూ దమ యంతి తాళం చెవులు మామగారికి యిచ్చేస్తూ, "క్రియకు వచ్చేటప్పటికి యింతే లెండి" అన్నది.

వంట ఇంట్లో సౌభాగ్యమ్మ నిట్టూర్పు విడిచిన చప్పుడు అస్పష్టంగా విన పడ్డది దమయంతికి.

ముద్రణ: భారతి, డిసెంబరు, 1935